సాక్షి కామారెడ్డి

సోమవారం। 30 । సెప్టెంబర్ । 2024



ఆస్పత్రికి సుస్తీ

హన్మాజీపేట పీహెచ్‌సీలో వైద్యాధికారితో పాటు పలు పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులకు సరైన సేవలందడం లేదు.

- 9లో ▸



బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.0 /22.1

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

చెదురుతున్న కలలు!

కుటుంబాలను రోడ్డున పడేస్తున్న ప్రమాదాలు ● కన్నవారికి, కట్టుకున్నవారికి తీరని దుఃఖం

రోడ్డు ప్రమాదాలతో జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. చెట్టంత ఎదిగిన కొడుకు ఆసరా అవుతాడనుకున్న తల్లిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయి. తోడుగా ఉంటాడని ఎన్నో కలలు కన్న జీవిత భాగస్వామికి జీవితాంతం కష్టాలే మిగులుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలలో 190 మంది మరణించారు. ప్రమాదానికి కారణం ఏదైనా సరే ప్రాణాలు పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 350 కిపైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాలలో 190 మంది మృతిచెందగా.. వందలాది మంది గాయాలపాలయ్యారు. మృతుల్లో సగానికిపైగా 20 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారే ఉన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే..

నిర్లక్ష్యం, అజాగ్రత్త, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది తలకు బలమైన గాయాలు తగిలి చనిపోతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో హెల్మెట్ ధరించి ఉంటే బతికే వారని చాలా సంఘటనలు నిరూపిస్తున్నాయి. వాహనాలను నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవడం ద్వారా కొంతవరకైనా ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు అవకాశాలుంటాయి. వేగం కన్నా ప్రాణం ముఖ్యమన్న విషయాన్ని మరిచిపోవద్దు. చాలా మంది త్వరగా వెళ్లిపోవాలన్న ఆరాటంతో వాహనం వేగం పెంచి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు దోస్తులతో కలిసి మద్యం సేవించి వాహనాలు నడపడం మూలంగా ప్రమాదాలబారిన పడుతున్నారు. తనపై ఆధారపడి తల్లిదండ్రులు, భార్య, పిల్లలు ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకుని, జాగ్రత్తగా వాహనాలను నడిపితే రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గే అవకాశాలుంటాయి.





దోమకొండ మండలంలోని ముత్యంపేటకు చెందిన జొన్నల రాము (23) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చనిపోయాడు. రాముకు తండ్రి వెంకటి, తల్లి నర్సవ్వ ఉన్నారు. గ్రామంలో హెయిర్ కటింగ్ సెలూన్ నడుపుతూ కుటుంబానికి అండగా ఉంటున్న కుమారుడి మృతితో అతడి కన్నవారికి కడుపుకోతే మిగిలింది.



ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన కొన్నగొల్ల రవి (32) అనే యువకుడు ఈ ఏడాది జూలై 19న పొలం వద్దకు వెళ్లాడు. వరినారు గంపను ఎత్తుకుని వెళ్తుండగా వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో ఆయన భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు రోడ్డున పడ్డారు.

ప్రమాదాలకు కారణాలెన్నో..

రోడ్డు ప్రమాదాల్లో చాలా వరకు బైకుల మీద వెళ్లే వారే ప్రాణాలు కోల్పోతున్నారు. మూలమలుపుల వద్ద వేగంగా వెళ్లడం, ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ఒక్కసారిగా బ్రేక్ వేసి కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరికొందరు మద్యం సేవించి వాహనాలు నడపడం మూలంగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంకొందరు అతివేగంగా నడుపుతూ వాహనం కంట్రోల్ కాక ప్రమాదానికి గురై చనిపోతున్నారు. కొందరు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కూడా ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రి వేళలో వాహనాల హెడ్‌లైట్ల కాంతిలో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనపడకపోవడంతోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



లింగంపేట మండలం మాలోత్ తండాకు చెందిన బదావత్ సుమన్ (29) కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మెదక్‌లో కూలి పనులకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు గౌతం, క్రితిస్, కూతురు దీక్షిత ఉన్నారు. సుమన్ మరణంతో స్వరూప కూలీ పనులు చేస్తూ పిల్లల్ని పోషించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఎల్లారెడ్డి మండలం కల్యాణి గ్రామానికి చెందిన గుజ్జరి జగదీశ్ ఎల్లారెడ్డి పట్టణంలో టిఫిన్ సెంటర్ నడుపుకుంటూ జీవించేవాడు. అతడికి భార్య, ఏడాది వయసున్న కూతురు ఉన్నారు. ఈ ఏడాది మే 2న హోటల్‌కు కావాల్సిన సామగ్రి తేవడానికి కామారెడ్డికి వెళ్లిన జగదీశ్.. ముస్తాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకు రూ.15 లక్షలు ఖర్చయినా ప్రాణం నిలువలేదు. దీంతో అతడి కుటుంబం అనాథ అయ్యింది.



లింగంపేట మండలం పర్మళ్ల గ్రామానికి చెందిన గంట సంతోష్ (22) జూన్ 10న సజ్జన్‌పల్లి నుంచి వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడి చనిపోయాడు. మృతుడికి తల్లిదండ్రులు లక్ష్మి, రత్నయ్య, ముగ్గురు అక్కలు ఉన్నారు. పెద్ద దిక్కుగా ఉంటాడనుకున్న కుమారుడు తమ కళ్లముందే కాటికి చేరడంతో ఆ తల్లిదండ్రులు కోలుకోలేకపోతున్నారు.

న్యూస్‌రీల్

'ఆర్టీసీ కార్మికులపై వేధింపులు తగవు'



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపోలో కార్మికులపై డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌లు వేధింపులను మానుకోవాలని కామారెడ్డి జేఏసీ ప్రతినిధులు జి.జగన్నాథం, నర్సింహారెడ్డి హితవు పలికారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్మికులను అసభ్యకర పదజాలంలో దూషించడం తగదన్నారు. డిపో అధికారులు కార్మికుల వద్ద నుంచి బలవంతంగా డబ్బులు చేస్తున్నారని ఆరోపణలున్నాయన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ ఆర్టీసీ ఎండీకి, రవాణా శాఖ మంత్రికి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను సెలవుపై పంపి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సంస్థలో కార్మిక సంఘాలను అనుమతించాలని, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆగం చేసిన వాన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): పంట చేతికొచ్చిన తరువాత కురుస్తున్న వాన అన్నదాతను ఆగం చేస్తోంది. విక్రయానికి సిద్ధంగా ఉన్న సోయా వర్షానికి తడిసిపోయింది. ఆదివారం మధ్యాహ్నం మండం కేంద్రంలో వర్షం కురవడంతో గ్రామశివారులో కోసి కుప్పపెడుతున్న సోయా తడిసింది. పలువురు రైతులు రోడ్లపై ఆరబోసిన సోయా నీటిలో కొట్టుకుపోయింది. వానలు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటుండగా, మళ్లీ వర్షం కురవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

నేడు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సోమవారం ఎన్నిక నిర్వహించనున్నారు. అధ్యక్ష పదవి కోసం మాజీ అధ్యక్షుడు శనిషెట్టి గౌరీశంకర్‌తోపాటు మాజీ కోశాధికారి పప్పుల రాజేంద్రప్రసాద్ పోటీ పడుతున్నారు. జిల్లాలో మొత్తం 185 మంది రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం కలిగి ఉన్నారు. గెలుపు కోసం ఇరువురూ హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. సోమవారం సోమవారం భవితవ్యం తేలనుంది.

నేడు మంత్రి జూపల్లి రాక

నిజామాబాద్ అర్బన్/ఖలీల్‌వాడి: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్‌లో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ శాఖ భవనాలను ప్రారంభిస్తారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు మధ్యాహ్నం 2:30 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

మాచారెడ్డి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సోమారంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సోమారంపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాలలో బాలబాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పోటీలలో పాల్గొనాలని సూచించారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు..

నిజామాబాద్ నాగారం: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ క్రీడా జట్లను ఎంపిక చేసేందుకు పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగామోహన్ చక్రు, పింజ సురేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. మెన్, ఉమెన్ విభాగాలలో ఆర్మూర్‌లోని గురుకుల బాలుర పాఠశాలలో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు క్రీడాకారులకు హాజరై పీఈటీ రాజేందర్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

రేపు కామారెడ్డికి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి రాక




కామారెడ్డి టౌన్: కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం జిల్లాకేంద్రంలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మంగళవారం ఉదయం 10.30 గంటలకు కొత్త బస్టాండ్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం సుభాష్‌రోడ్, తిలక్‌రోడ్‌లలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటారని, మధ్యాహ్నం 12.30 గంటలకు రాజారెడ్డి గార్డెన్‌లో సభ్యత్వ నమోదు కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



నందిపేట్: హిందూ ధర్మం పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని రాష్ట్రీయ హిందూ వాహిని సంఘ సభ్యులు కోరారు. నందిపేటలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో జరుగుతున్న రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ జాతీయ సమావేశాలు ఆదివారం ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, హిందూ వాహిని సంఘం జాతీయ అధ్యక్షుడు రమేష్ చంద్ర దివేది, అయోధ్య మహా పీఠాదిష్ శ్రీ వైదేహి వల్లభ శరన్ మహరాజ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జగద్గురు కల్కి మహరాజ్, హిందూ శక్తి కన్వీనర్ సరిత గిరి, స్వామి సిద్ధియోగి, భగవంతురావు, ద్వారకా పీఠాధిపతి స్వామి త్రిలోకి స్వరూప తీర్థ ప్రసంగిస్తూ హిందూ ధర్మం యొక్క గొప్పతనం వివరించారు. అనంతరం మంగి రాములు మహరాజ్ సాధువులు, హిందూ ప్రతినిధులను సన్మానించారు.

జీపీలకు కాస్త ఉపశమనం!



నాగిరెడ్డిపేట మండలంలోని జప్తి జాన్కంపల్లి గ్రామం

- రూ.6.53 కోట్ల నిధులు విడుదల
- స్థానిక అవసరాలకు వెచ్చించాలని ఆదేశాలు
- ఊపిరి పీల్చుకున్న పంచాయతీ కార్యదర్శులు

నాగిరెడ్డిపేట: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలకు కాస్త ఉపశమనం లభించింది. ట్రాక్టర్ల ఈఎంఐలు, విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలతోపాటు స్వచ్ఛదనం – పచ్చదనం తదితర వాటికి వెచ్చించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం రూ.6.53 కోట్ల ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ గ్రాంట్) నిధులను విడుదల చేసింది. పాలకవర్గాల పదవీకాలం పూర్తయినప్పటి నుంచి నిధుల కొరతతో పంచాయతీల్లో పాలనపడకేసింది. జీపీ అవసరాలకు నిధులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న పంచాయతీల కార్యదర్శులు తాజాగా ఎస్ఎఫ్‌సీ నిధుల మంజూరుతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం మంజూరైన నిధుల్లో నుంచి ట్రాక్టర్ల ఈఎంఐలకు రూ.19.73లక్షలు, విద్యుత్ బిల్లులకు రూ.1.57 కోట్లు, కార్మికుల వేతనాల కోసం రూ.1.99 కోట్లు, స్వచ్ఛదనం – పచ్చదనం కోసం రూ.2.76 కోట్లు వెచ్చించనున్నారు.

కార్యదర్శులపై తగ్గనున్న భారం

ఈ ఏడాది ఫిబ్రవరి 2న గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. పాలకవర్గాలు కొనసాగిన సమయంలో గ్రామాల్లో చేపట్టే ప్రతి పనికి సర్పంచులు ముందు డబ్బులు ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునేవారు. అయితే పాలకవర్గాల పదవీకాలం ముగిసిన నాటి నుంచి గ్రామాల్లో చేపట్టే పనులకు పంచాయతీ కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటు, బోరుమోటార్ల మరమ్మతులు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, డీజిల్ కొనుగోలు వంటి వాటికి పంచాయతీ కార్యదర్శులు జేబులోనుంచి ఖర్చు చేశారు. తాజాగా పంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ నిధులు మంజూరు కావడంతో పంచాయతీ కార్యదర్శులకు కొంత మేర ఆర్థికభారం తప్పనుంది.

చేప పిల్లల సరఫరాపై నీలినీడలు

- టెండర్లు పూర్తయినా కనిపించని జాడ
- ఆందోళనలో మత్స్యకారులు



ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): జిల్లాలోని ప్రధాన జలాశయాలు, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నా చేప పిల్లల సరఫరా జాడ లేదు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదేళ్లపాటు వందశాతం సబ్సిడీపై చేప, రొయ్యపిల్లలు పంపిణీ చేశారు. దీంతో మత్స్యకారుల జీవనోపాధికి ఢోకా లేకుండాపోయింది. ఈ ఏడాది మాత్రం పరిస్థితి భిన్నంగామారింది. ఇప్పటికీ చేప పిల్లలను పంపిణీ చేయలేదు.

జిల్లాలోని 768 చెరువులు, కుంటలతోపాటు ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టుల్లో 2.8 కోట్ల చేప పిల్లలు విడుదల చేయాల్సి ఉండగా.. లక్ష్యాన్ని ఈసారి 50 శాతానికి తగ్గించారు. 1.4 కోట్ల చేప పిల్లలను విడుదల చేసేందుకు మత్స్యశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. 720 మత్స్య సహకార సంఘాల్లో 14 వేల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై నాలుగు నెలలవుతున్నా చేపపిల్లల పంపిణీ జాడ లేదు. ఓ వైపు టెండర్లు పూర్తయినా.. మరోవైపు సమయం మించిపోతున్నా చేప పిల్లలు సరఫరా కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు.

సరఫరా చేయాలి



వర్షాలు విస్తారంగా కురిసినా చేప పిల్లలను సరఫరా చేయడం లేదు. వరదలకు కొత్త నీరొచ్చి చేపపిల్లలకు ఆహారం సిద్ధంగా ఉంది. ఇకనైనా చేపపిల్లలను సరఫరా చేయాలి. అప్పుడే మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది.

– బోయి రాములు, మాజీ డైరెక్టర్, అచ్చంపేట

ఆదుకోవాలి



వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను విడుదల చేసి మత్స్యకారులను ఆదుకోవాలి. చెరువులు, కుంటలు, ప్రధాన జలాశయాల్లో చేపపిల్లలను విడుదల చేయాలి. చేపల వేటతోనే మాకు ఉపాధి లభిస్తుంది.

– బెస్త కృష్ణ, మాజీ డైరెక్టర్, హసన్‌పల్లి

మూడు బృందాలను ఏర్పాటు చేశాం

చేప పిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. కాంట్రాక్టర్ చేప పిల్లలను సరఫరా చేస్తే వాటిని నెల రోజుల్లో పంపిణీ చేసేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేశాం.

– శ్రీపతి, మత్స్యశాఖ ఏడీ, కామారెడ్డి

30 రోజులు.. 36 టీఎంసీల వరద

- నిజాంసాగర్ ప్రాజెక్టులోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- పరవళ్లు తొక్కుతున్న మంజీర



మంజీర నదిలో ప్రవహిస్తున్న వరద నీరు

నిజాంసాగర్(జుక్కల్): కర్నాటక, మహారాష్ట్రలతోపాటు ఎగువన ఉన్న స్థానిక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు 30 రోజుల్లోనే 36 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది. సింగూరు జలాశయంతోపాటు హల్దీవాగు, ఘనపురం ఆనకట్ట, పోచారం ప్రాజెక్టుల వరద నీటితో మంజీర ఉధృతంగా ప్రవహిస్తోంది. సరైన వర్షాలు లేక ఆగస్టు నెలాఖరు వరకు బోసిపోయిన నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుతం కళకళలాడుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.82) కాగా పూర్తిస్థాయి నీటి మట్టంతో జలకళను సంతరించకుంది. ఈ నెల 4వ తేదీన ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదలను చేపట్టారు. 17 రోజుల్లో 20.5 టీఎంసీల నీరు దిగువకు విడుదలైంది. వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో మంజీర పరవళ్లు తొక్కుతోంది. ప్రస్తుతం 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, ఆదివారం నుంచి రెండు గేట్ల ద్వారా 11వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టుకోసం ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.



పచ్చని పంటపొలాల మధ్య నుంచి ఉన్న దారికి ఇరువైపులా చీరలు కట్టిన ఈ దృశ్యం నాగిరెడ్డిపేట మండలం జప్తిజాన్కంపల్లి శివారులోనిది. పశువుల నుంచి పంటలను రక్షించేందుకు రైతులు చీరలతో కంచె ఏర్పాటు చేసుకున్నారు. పచ్చదనంతో కళకళలాడుతున్న ఆ ప్రాంతానికి చీరలు కొత్త అందాన్ని తీసుకువచ్చాయి.

– నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి)

క్లుప్తంగా

శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్ల అందజేత



డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామీణ యువ రైతులు రాబోయే రోజుల్లో విత్తన వరిని నేరుగా పండించుకుని ఇతర రైతులకు విక్రయించి ఆదాయాన్ని ఆర్జించాలని ఆత్మ పీడీ ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో వరి విత్తన ఉత్పత్తిపై వారం రోజుల పాటు శిక్షణ తీసుకున్న యువ రైతులకు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ కోటేశ్వర్ రావు, ఏవో స్పందన, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ భరత్, సురేశ్ ఉన్నారు.

మాక్లూర్ ఎంపీడీవోగా ట్రైనీ ఐఏఎస్ అధికారి

మాక్లూర్: మాక్లూర్ ఎంపీడీవో(ఇండిపెండెంట్)గా ట్రైనీ ఐఏఎస్ అధికారి సంకేత్ కుమార్ నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఉన్న జె. క్రాంతి బదిలీ కావటంతో ఆమె స్థానంలో సంకేత్ కుమార్ బాధ్యతలు తీసుకుంటారని ఎంపీవో శ్రీనివాస్ తెలిపారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషిచేయాలి



ఆర్మూర్: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థి విజయానికి పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జెస్సు అనిల్ కుమార్, బాల్కొండ నియోజకవర్గం నుంచి మల్లికార్జున్‌ను కన్వీనర్లుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు పూర్తి



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎంపికలు ఆదివారం నగరంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రత్నాకర్ సరాల, రాజాగౌడ్‌ల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అండర్–14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అక్టోబర్ 7 , 8వ తేదీల్లో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. అండర్–14 బాలుర విభాగంలో ఎంజేపీ(రాంపూర్), బాలికల విభాగంలో కేజీబీవీ(ఆర్మూర్), అండర్–16 బాలుర విభాగంలో ఎంజేపీ(రాంపూర్), బాలికల విభాగంలో నిజామాబాద్ విజయ హైస్కూల్ క్రీడాకారులు చాంపియన్లుగా నిలిచాయి. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ హైదర్ అలీ, ఉపాధ్యక్షులు కపిల్, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్, కోచ్ శివ, పీటీలు పాల్గొన్నారు.

మృత్యువాతకు కారణమేంది?

చేప పిల్లల కేంద్రంలో ఈ ఏడాది 29 లక్షల స్పాన్ మృతి

- 2018, 2021లలోనూ ఇదే పరిస్థితి
- ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన స్పాన్‌కు గండం
- ఎందుకు చనిపోతున్నాయో తేల్చని అధికారులు



జాతీయ చేప పిల్లల కేంద్రం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల కేంద్రంలో చేప పిల్లలు ఎదగకుండా ఎందుకు చనిపోతున్నాయో ఇప్పటికీ అధికారులు తేల్చలేదు. ప్రస్తుతం సంవత్సరం 29 లక్షల స్పాన్(చిన్నర చేప పిల్లలు) మృత్యువాత పడింది. చేప పిల్లల కేంద్రంలో సరైన వసతుల లేక మృతి చెందుతున్నాయా.. లేక ఇతర కారణాల వల్ల చనిపోతున్నాయా అనేది ఇప్పటి వరకు అధికారులు పరిశీలన చేయలేదు. ఈ ఏడాది జాతీయ చేప పిల్లల కేంద్రంలో చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించినా విఫలమైంది. దీంతో ఒక్క స్పాన్ కూడా ఉత్పత్తి కాలేదు. దీంతో కరీంనగర్ నుంచి ప్రభుత్వ చేప పిల్లల కేంద్రం నుంచి 29 లక్షల స్పాన్‌ను పోచంపాడ్ జాతీయ చేప పిల్లల కేంద్రానికి తీసుకువచ్చారు. గుడ్డు నుంచి స్పాన్‌ను తీసి, స్పాన్ నుంచి చేప పిల్ల వస్తుంది. అలా తీసుకువచ్చిన స్పాన్‌ను కుండీల్లో భద్రపరచాలి. పోచంపాడ్ కుండీల్లో భద్ర పరిచిన స్పాన్ మృతి చెందింది. దీనికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను బాధ్యులను చేసి తొలిగించారు. ప్రతి సీజన్‌లో కొంత మంది సిబ్బందిని నియమించుకుని జూలై, ఆగస్టు సెప్టెంబర్ నెలలు కాగానే సిబ్బందిని తొలిగిస్తారు. ప్రస్తుతం కూడ అదే జరిగింది. గతంలో కూడా జాతీయ చేప పిల్లల కేంద్రంలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన స్పాన్ మృతి చెందింది. 2018, 2021లో జగిత్యాల్ నుంచి కోటి చొప్పున రెండేళ్ల పాటు తీసుకువచ్చారు. ఆ స్పాన్ కూడ మొత్తం చనిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన స్పాన్ ద్వారా ఉత్పత్తయిన చేప పిల్లలే చనిపోతున్నాయి. ఇక్కడి స్పాన్ ద్వారా ఉత్పత్తయిన చేప పిల్లలకి ఎలాంటి ఇబ్బంది కాలేదు. కారణం ఏంటో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

జాతీయ చేప పిల్లల కేంద్రంలో పర్యవేక్షణ కరువైంది. ఆరేళ్లుగా ఎఫ్‌డీవో ఉండటం లేదు. ప్రస్తుతం ఉన్న ఎఫ్‌డీవో కూడా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. సీజన్‌లో కూడా విధులు నిర్వర్తించలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అధికారి లేకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. దీంతో చేప పిల్లల ఉత్పత్తి కాలేదు. తీసుకువచ్చిన చేపపిల్లల స్పాన్ మృత్యువాత పడింది. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

సరిగా పట్టించుకోలేదు

చేపపిల్లల కేంద్రంలో స్పాన్ మృత్యువాత పడటానికి నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. ఒక్కటి చనిపోతే వెంటనే ఆ ఒక్కదాన్ని తీసివేయాలి. అలా చేయకపోవడంతో అది వైరస్‌గా మారి అన్నింటికి చుట్టుకుంది. ఎఫ్‌డీవో కూడ లేకపోవడం ఒక కారణమైంది. మళ్లీ తీసుకువచ్చి కొంత మేర ఉత్పత్తి చేయడానికి ప్రయత్నిస్తాం.

–ఆంజనేయులు, ఏడీ, నిజామాబాద్

సమాజ మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులే

- ఎమ్మెల్యేలు రేకుల భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులని, కాలానికనుగుణంగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిపై ఉందని ఎమ్మెల్యేలు రేకులపల్లి భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. బర్ధిపూర్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో ఆదివారం ట్రస్మా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి సమస్యల పరిష్కరించే విధంగా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ రోజుల్లో విద్య, వైద్యం చాలా ఖరీదుగా మారిందని, సామాజికక దృక్పథంతో ఆలోచించి పేద కుటుంబాల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలో 250 ప్రైవేట్ స్కూళ్లకు చెందిన పాఠశాలల్లో ఒక్కో పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి వారికి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు, మెమోంటోను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీఈవో దుర్గాప్రసాద్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు రాస నిత్యానందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి, చీఫ్ అడ్వైజర్ శేఖర్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి, అధికార ప్రతినిధి జయసింహ గౌడ్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయారెడ్డి, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి గోజూరి అరుణ్, కాంతి గంగారెడ్డి పాల్గొన్నారు.



పాల్గొన్న ప్రైవేట్ పాఠశాలల యజమానులు, ఉపాధ్యాయులు

వ్యవసాయ శాఖలో 'సర్వే' లొల్లి

- ఏఈవోలకు నోటీసులిచ్చిన రెంజల్ ఏవో
- నిరసనగా డీఏవో కార్యాలయంలో బైఠాయించిన ఏఈవోలు



డీఏవో కార్యాలయంలో బైఠాయించిన ఏఈవోలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'డిజిటల్ క్రాప్ సర్వే' సందిగ్ధంలో పడింది. సహాయకులను నియమిస్తేనే సర్వే చేస్తామని వ్యవసాయ విస్తర్ణాధికారులు(ఏఈవోలు) వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సహాయ నిరాకరణ చేపడుతున్నారు. అయితే, జిల్లాలో ఓ మండల వ్యవసాయాధికారి తీరుపై ఏఈవోలు తిరుగుబాటుకు దిగారు. అధికారిపై నిరసన వ్యక్తం చేస్తూ శనివారం సాయంత్రం జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో బైఠాయించి ధర్నా చేశారు. డీఏవో వాజిద్ హుస్సేన్‌తో పాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ఫిర్యాదు చేశారు. పంటల డిజిటల్ సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించింది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సర్వే చేయాలని ఏఈవోలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఏఈవోలు ఒక్కరితోనే క్రాప్ సర్వే చేయడం సాధ్యం కాదని, పంట పొలాలకు వెళ్లలేని చోటికి వెళ్లి సర్వే నంబర్ల వారీగా వివరాలు నమోదు చేయలేమని రాష్ట్ర వ్యాప్తంగా ఏఈవోలు సహాయ నిరాకణ చేపట్టారు. ఐతే, సర్వే చేపట్టనందుకు రెంజల్ ఏవో ఇటీవల ఏఈవోలకు నోటీసులు ఇచ్చారు. దీనిపై ఏఈవోలు గుర్రుగా ఉన్నారు.

పోచంపాడ్‌లో జోరుగా మట్కా

- సెల్‌ఫోన్ మెసేజ్‌లతో కొనసాగుతున్న దందా
- ఆర్థికంగా నష్టపోతున్న సామాన్య ప్రజలు
- మట్కాపై నిఘా కరువు
- పట్టించుకోని పోలీసు యంత్రాంగం



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో మట్కా జోరుగా సాగుతోంది. గతంలో రహస్యంగా కాగితం చిట్టీలపై నంబర్లతో మట్కా సాగేది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో గుట్టు చప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో ఫోన్‌ల ద్వారా జోరుగా మట్కా దందా సాగుతోంది. పొద్దంత కూలీ పనిచేసే వారు సైతం మట్కాకు బానిసై జేబులు గుల్లా చేసుకుంటున్నారు. గతంలో మట్కా నిర్వాహకులపై పలుమార్లు పోలీసులు దాడులు చేసినా మార్పు రాలేదు. కల్యాణి, బొంబాయి అంటూ మట్కా చాట్‌లు ఇస్తూ ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టిస్తున్నారు. మట్కారాయులు ఎవరో తెలిసి కూడా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పేరు మారినా..

పోచంపాడ్ అనే పేరులో పాడు ఉందని ఊరి పేరును శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌గా పేరు మారింది. కానీ పేరు మారినా పాడు మాత్రం మారడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పోచంపాడ్‌లో పలు గోడలకు మట్కాతో కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ రాతలు రాయించారు. కానీ ఎక్కడా మార్పు రాలేదు. దీనిపై పోలీసులు పెద్దగా పట్టించుకోకపోవడంతో మళ్లీ విస్తరంగా సాగుతోంది. పోచంపాడ్ ఊరుతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై నిత్యం మట్కా, గ్యాంబ్లింగ్ సాగిస్తున్నారు.

గతంలో సీఐ కార్యాలయం ఏర్పాటు

ఎస్సారెస్పీ వద్ద 2012లో ఆర్మూర్ రూరల్ సీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఎస్సారెస్పీకి భద్రత, మట్కాకు అడ్డుకట్ట వేయాలనే భావనతో రూరల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ తర్వాత ఆర్మూర్‌కు తరలించగా అక్కడి నుంచి గతేడాది బాల్కొండ పీఎస్‌కు తరలించారు. అక్కడ సీఐ కార్యాలయం తర్వాత ఔట్ పోస్టును ఏర్పాటు చేశారు. దానిని కొన్నాళ్లకే తొలగించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోతుండడంతో మట్కారాయుళ్లు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. అంతా ఆన్‌లైన్‌లోనే కావడంతో పెద్దగా బయటకు కనిపించడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మట్కాకు జట్కా వేయాలని పలువురు కోరుతున్నారు.

త్వరలోనే నియంత్రిస్తాం

పోచంపాడ్‌లో మట్కా, గ్యాంబ్లింగ్ నడుస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. రెండింటిని త్వరలోనే నియంత్రిస్తాం. ఎక్కడా మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలి. వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

– నారాయణ, ఎస్సై, మెండోరా

క్రీడలు మనోధైర్యాన్ని పెంచుతాయి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: క్రీడలు కేవలం మానసికోల్లాసానికి, శారీరక ధారుడ్యానికే కాకుండా జీవింతలో మనోధైర్యాన్ని నింపటానికి ఉపయోగపడుతాయని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. భీంగల్ మండల కేంద్రంలో ఆదివారం ఎస్‌జీఎఫ్ అంతర్ పాఠశాలల క్రీడలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు ప్రామాణికం కాదని, పాల్గొనడమే పెద్ద అదృష్టమన్నారు. తల్లిదండ్రులు చదువుతోపాటు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు విద్యార్థులు మార్చ్‌పాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



సమావేశమైన 1998-99 కామారెడ్డి సీఎస్ఐ హైస్కూల్ 10వ తరగతి పూర్వవిద్యార్థులు

కామారెడ్డి రూరల్: పట్టణంలోని సీఎస్ఐ హైస్కూల్ 1998–1999 పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సుమారు 50 మంది సమావేశమయ్యారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

ఆత్మకూర్ హైస్కూల్ ..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్ హైస్కూల్‌లో ఆదివారం 2008–09బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. పదిహేను సంవత్సరాల తర్వాత స్నేహితులు మళ్లీ కలుసుకోవడంతో వారంతా ఒక్కసారిగా ఉద్వేగానికి లోనయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల హెచ్‌ఎం సాయన్నతోపాటు ఇతర ఉపాధ్యాయులు సుదర్శన్, సంతోష్, వెంకటనర్సయ్య, మహిపాల్, నరేందర్, జయరాంరెడ్డి, మహేందర్‌రెడ్డిని ఆహ్వానించి సత్కరించారు.



ఆత్మకూర్ హైస్కూల్ 2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

లారీ, కారు ఢీకొని ఒకరికి..



ప్రమాదంలో దెబ్బతిన్న కారు




వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్సై సుశీల్ కుమార్

జక్రాన్‌పల్లి: అర్గుల్ గ్రామ శివారులో 44వ నెంబర్ జాతీయ రహదారిపై లారీని కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన హేమంత్, అరుణలు కారులో హైదరాబాద్ నుంచి కోరుట్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అర్గుల్ శివారులోకి రాగానే జాతీయ రహదారిపై కుడి వరుసలో నుంచి వెళ్తున్న లారీ అకస్మాత్తుగా ఎడమ వైపు వరుసలోకి రావడంతో వెనుక నుంచి ఓవర్ టేక్ చేస్తున్న కారు లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో హేమంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు బెలూన్లు తెరుచుకోవడంతో ముందు సీట్లో కూర్చున్న హేమంత్, అరుణలు ప్రాణాలతో బయటపడ్డారు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై సుశీల్ కుమార్ పరిశీలించారు. అనంతరం లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని మరొకరికి..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రధాన రహదారి పక్క నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో చోటుచేసుకుంది. ఆత్మకూర్ గ్రామానికి చెందిన పీకే రాజయ్య గోపాల్‌పేటలో నడుచుకుంటూ వెళ్తుండగా ధర్మారెడ్డి గ్రామానికి చెందిన దాసరి రాజు అనే వ్యక్తి తన బైక్‌తో ఆయనను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పీకే రాజయ్య తల, ముఖానికి గాయాలు కాగా దాసరి రాజు ముఖానికి గాయాలయ్యాయి. పోలీసులు ప్రమాదంలో గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం పీకే రాజయ్యను మెరుగైన వైద్యం కోసం మెదక్ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి..



గాయపడిన దోండిబా

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి– 161పై ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. జుక్కల్ మండలంలోని కథల్వాడి గ్రామానికి చెందిన దోండిబా అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి జుక్కల్ వస్తుండగా గొర్రె అడ్డు రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి



ఎడపల్లి(బోధన్): ఠాణాకలాన్ శివారులోని పంట పొలాల్లో గోవూరి పోశెట్టి(45) అనే కౌలు రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డి తెలిపారు. పంట చేలను పందుల బారి నుంచి కాపాడడానికి అమర్చిన విద్యుత్ తీగ తీయడానికి వెళ్లిన పోశెట్టి అక్కడే జారి వైరు మీద పడటంతో షాక్ తగిలి మరణించినట్లు ఎస్సై చెప్పారు. పోచయ్య భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దళితవాడలో వృద్ధురాలి దారుణ హత్య

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని దళితవాడ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం గోనె కాశవ్వ(60) అనే వృద్ధురాలు హత్యకు గురైంది. హత్య జరిగిన సమయంలో ఇంట్లో గోనె కాశవ్వ ఒక్కరే ఉన్నారు. ఆమె కోడలు కూలి పనికి వెళ్లింది. కాశవ్వ ఒక్కరే ఉండటం గమనించిన గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోకి వెళ్లి మెడలో ఉన్న బంగారం, వెండి నగలు తీసుకొని హత్య చేసి పారిపోయినట్లుగా అనుమానిస్తున్నారు. ఇంటి పక్కనే ఉన్న భూదవ్వ అనే మహిళ కాశవ్వ ఇంటి వాకిట్లో నిలబడి పిలవగా ఎలాంటి చప్పుడు కాకపోవడంతో గడప దగ్గర వెళ్లి చూడగా గోనె కాశవ్వ రక్తపు మడుగులో పడి ఉంది. భయపడి స్థానికులను పిలవగా వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్సై మోహన్‌రెడ్డి చేరుకొని హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించారు. ఓ యువకుడిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్టాండ్ వద్ద బ్లేడ్‌తో దాడి చేసి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. వివరాలు.. నగరంలోని పూసలగల్లీకి చెందిన దేవసి దాల్రాం వ్యాపారరీత్యా శనివారం నందిపేట్‌కు వెళ్లారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు నిజామాబాద్ బస్టాండ్‌లో దిగి వచ్చి బయటకు వస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి బ్లేడ్‌తో దాడి చేసి ఆయన మొబైల్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరైన ఆర్మూర్ శాస్త్రినగర్‌కు చెందిన షేక్ ఆరీఫ్(26)ను బోధన్ బస్టాండ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని, మొబైల్‌ను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు.

స్కీముల పేరిట రూ.2 లక్షలకు టోకరా

నిజాంసాగర్(జుక్కల్): స్కీముల పేరిట నెలకు రూ.3 వేలు చెల్లిస్తే ఫ్రిజ్, బీరువా ఇస్తామంటూ ఇద్దరు వ్యక్తులు అమాయకులను నమ్మించి రూ. 2 లక్షల వరకు టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం, శేర్‌ఖాన్‌పల్లి గ్రామాలకు ఈ నెల 25న ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. బాన్సువాడలో కొత్తగా ఎలక్ట్రానిక్స్ షాపు పెట్టామని నెల నెలా రూ.3 వేలు చెల్లిస్తే ఫ్రిజ్, బీరువాలు ఇస్తామని అమాయకులను నమ్మించారు. సింగితంలో 45, శేర్‌ఖాన్‌పల్లిలో 15 మంది ఒక్కొక్కరు రూ.3 వేల చొప్పున చెల్లించారు. సాయంత్రం వరకు ఫ్రిజ్‌లు, బీరువాలు ఇస్తామని చెప్పడంతో డబ్బులు కట్టారు. ఎలాంటి రసీదులు ఇవ్వకుండా రెండు ఫోన్ నంబర్లు(9398696759, 8555973223) మాత్రమే ప్రజలకు ఇచ్చారు. సాయంత్రం డబ్బులు కట్టిన ప్రజలు ఆ ఫోన్ నంబర్లకు కాల్ చేయగా 2 రోజుల్లో ఫ్రిజ్‌లు, బీరువాలు ఇస్తామని నమ్మబలికారు. ఆ తర్వాత రోజు నుంచి ఫోన్లు ఎత్తడం లేదని బాధితులు ఆదివారం సాక్షికి తెలిపారు. జరిగిన మోసంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు.

వృద్ధురాలి అదృశ్యం



కుమ్మరి భూమవ్వ

బిచ్కుంద(జుక్కల్): శాంతాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి భూమవ్వ(63) అనే వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ నెల 14 నుంచి కనపడటం లేదని భర్త మారుతి బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న చిన్న తక్కడ్‌పల్లి గ్రామానికి కుండలు అమ్ముకోవడానికి వెళ్తున్నా అని చెప్పినట్లు మారుతి పేర్కొన్నారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మోహన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్లు..!



కళకళలాడుతున్న జప్తిజాన్కంపల్లి, బొల్లారం శివారులోని వరిపంట

నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లి, బొల్లారం గ్రామాల్లోని ఊరచెరువుల కింద సాగుచేసిన వరిపంటలతో ఆ ప్రాంతమంతా పచ్చని రంగేసినట్లుగా ఉంది. కనుచూపుమేర ఆ ప్రాంతమంతా పచ్చని పైరుతో చూడముచ్చటగా ఉంది. ఆ చెరువుగట్ల వెంబడి నడుచుకుంటూ వెళ్తుంటే చల్లటిగాలితో ఆహ్లాదకరంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. – నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి)

ప్రారంభానికి నోచుకోని జీపీ భవనం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : జిల్లాలోని చాలా మండలాల్లో గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాల్లేక ఇబ్బందులు పడుతుంటే.. పోచారం తండాలోని జీపీ భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. గుత్తేదారుకు కాంట్రాక్ట్ డబ్బులు చెల్లించకపోవడంతో భవనం ప్రారంభానికి అవకాశం ఇవ్వలేదు. ప్రస్తుతం జీపీ కార్యకలాపాలు అంగన్‌వాడీ కేంద్రంలోని ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. నూతన భవనాన్ని ప్రారంభించేలా చూడాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు.